www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 5 నవంబర్ 2024
5
వైఎస్ఆర్

పారదర్శకంగా విచారించాలి : ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఎంతో ఆశతో వస్తారని వారి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమాత్యా.. ఆలకించరా!

- ఉక్కు పరిశ్రమ పనుల్లో కదలికేదీ
- ఏళ్ల తరబడి అందని గండికోట పరిహారం
- శంకుస్థాపన దశలోనే ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ
- నేడు డిఆర్‌సి సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత రాక

జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారంపై అందరి దృష్టి నిలిచింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, చెన్నూరులో చక్కెర పరిశ్రమ పునరుద్ధరణ, కడపలో స్ట్రోమ్‌వాటర్ డ్రైన్స్, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ ఏర్పాటు, గండికోట నిర్వాసితుల పరిహారం, బ్రహ్మసాగర్, సర్వరాయసాగర్ ఓకెజి జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు పునరుద్ధరణ, కొప్పర్తి పైప్‌లైన్ పనులు, ఎంఎస్ఎంఇ తరలింపు, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, ఎన్‌హెచ్-67 రహదారి నిర్మాణ పనుల్లో అలసత్వం, మైలవరం టెక్స్‌టైల్స్ పార్క్ పెండి ంగ్ పనులు సవాళ్లు విసురుతున్నాయి. మంగళవారం డిఆర్‌సి సమావేశానికి హాజరవుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పర్యటన నేపథ్యంలో కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామికవాడకు కేటాయించిన ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కు తరలింపు పట్ల కూటమి సర్కారు వైఖరి పట్ల పార్టీల కతీతంగా నిరసన వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు సమగ్రంగా చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలి. రూ.150 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటి సరఫరా పైప్‌లైన్ సాకారానికి నోచుకోవడం లేదు. నీటి కొరత కారణంగా పారిశ్రామిక పురోగతి వెనకడుగు వేస్తుండడం తెలిసిందే. వైఎస్ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలకు నీటి సదుపాయం అందడం లేదు. ఫలితంగా ఎప్పటికి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు సాగిస్తాయో తెలియడం లేదు. జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉండగా పదేళ్లుగా హామీ అమలుకు నోచుకోలేదు. జెఎస్‌డబ్ల్యూ కంపెనీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినప్పటికీ ఆశించిన పురోగతి కొరవడింది. కడప నగరంలో రూ.70 కోట్ల విలువైన స్ట్రోమ్ డ్రెయిన్‌ల ఏర్పాటు హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి కడప నగరం మునుగుతోంది. కాల్వల ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపట్టడానికి ఇచ్చిన హామీ నిధులు లేక నీరోడుతోంది. రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు మోక్షం లభించలేదు. ఐదేళ్లుగా స్థలం ఎంపిక, శంకుస్థాపన దశలోనే మగ్గుతోంది. ఫలితంగా యూనివర్శిటీ నిర్మాణం ఎప్పటికి సాకా రమవుతుందో తెలియదు. రూ.12 కోట్లతో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన హజ్‌హౌజ్ అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. రూ.12 కోట్లతో కూడిన బుగ్గవంక ప్రహరీకి ఇరువైపులా రహదారి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ ఎప్పుడు ఏర్పడతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. కడప, ప్రొద్దుటూరు పాలపరిశ్రమల కార్యకలాపాలు ఆశించిన రీతిలో సాగడం లేదు. ప్రొద్దుటూరులో మూలన పడిన పాలపరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోలేదు. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామికొండ రిజర్వా యర్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. నీటిపారుదలశాఖ రూ.212 కోట్లతో కూడిన ప్రతిపాదనలు పంపినప్పటికి పాలనాపరమైన అనుమతుల మంజూరు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. గండికోట నిర్వాసితుల పరిహారం ప్రహసనంగా మారింది. అదనపు పరిహారం కింద రూ.3.25 లక్షలు ఇస్తామన్న హామీ కాగితాలకే పరిమితమైంది. రాయచోటి-చాగలమర్రి జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెక్కిరిస్తోంది. రెండు, మూడేళ్లుగా రహదారి నిర్మాణం స్తంభించిపోయింది. ఎన్‌హెచ్-67 మైదుకూరు, బద్వేల్, కృష్ణపట్నం పోర్టు రహదారి నిర్మాణ పనులు, కడప-రేణిగుంట మధ్య 133 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ టెండర్లు పట్టాలకు ఎక్కిన దాఖలాల్లేవు. మైలవరం టెక్స్‌టైల్స్ పార్కు దశాబ్దాల తరబడి సాగుతూనే ఉంది. గతేడాది జనవరిలో రూ.1.14 కోట్లతో సుమారు 62.18 ఎకరాల విస్తీర్ణంలో 118 ప్లాట్ల నిర్మాణ పనులు చేపట్టారు. మూడు నెలల్లో సాకారం చేయాలనే లక్ష్యంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఏడాది కావస్తున్నా సాకారానికి నోచుకోలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చేనేత సంక్షేమశాఖ మంత్రి కావడంతో టెక్స్‌టైల్స్ పార్కు సత్వరమే పట్టాలకు ఎక్కించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, విఆర్‌ఎల సంఘం గౌరవాధ్యక్షులు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యలు పరిష్కారమవుతాయని విఆర్‌ఎలు ఆశాగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఎనిమిదేళ్లుగా వేతనాలు పెరగక చాలీచాలని వేతనాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్నారని వాపోయారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాపితంగా ఖాళీగా ఉన్న విఆర్‌ఎ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్లు తదితర పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్న విఆర్‌ఎలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. వారి సమస్యలు పరిష్కరించకపోగా, నిబంధనలకు విరుద్ధంగా అదనపు పనిభారం మోపడం దారుణమని తెలిపారు. బలవంతంగా నైట్ డ్యూటీలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి భద్రత, రక్షణ సౌకర్యాలు కల్పించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పైగా అక్రమ ఇసుకను అడ్డుకునేందుకు, రైస్ మిల్లుల వద్ద అదనపు విధులు చేయిస్తున్నారన్నారు. విఆర్‌ఎలకు ఇంటర్ విద్యార్హతలు ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల మీద ఈనెల 18న చలో విజయవాడ సిసిఎల్‌ఎ కార్యాలయానికి తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఆర్‌ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి, వెంకటసుబ్బయ్య, చక్రవర్తి, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, ఉదయ్, దేవాదసు, సుధాకర్, రమణయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు. **కమలాపురం టౌన్ :** విఆర్‌ఎల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. విఆర్‌ఎల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో సోమవారం స్థానిక ధర్నా నిర్వహించి తహశీల్దార్ శివరాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించకపోగా, నిబంధనలకు విరుద్ధంగా అదనపు పనిభారం మోపడం దారుణమని తెలిపారు. బలవంతంగా నైట్ డ్యూటీలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి భద్రత, రక్షణ సౌకర్యాలు కల్పించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పైగా అక్రమ ఇసుకను అడ్డుకునేందుకు, రైస్ మిల్లుల వద్ద అదనపు విధులు చేయిస్తున్నారన్నారు. విఆర్‌ఎలకు ఇంటర్ విద్యార్హతలు ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రమేష్, రాజేష్, గంగరాజు, పలువురు విఆర్‌ఎలు పాల్గొన్నారు.

సమస్యలను ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు విన్నవిస్తున్న మనోహర్

ఆచార్యుల పోస్టులు భర్తీ చేయాలి : రూట

ప్రజాశక్తి - కడప అర్బన్

డాక్టర్ అబ్దుల్ హఖ్ ఉర్దూ విశ్వవిద్యాలయం స్థాపించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ కేవలం అకాడమిక్ కన్సల్టెంట్‌లతోనే నెట్టుకొస్తున్నారని, వెంటనే ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులన్నీ భర్తీ చేయాలని ఇన్‌ఛార్జి విసి షావలి ఖాన్‌కు రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసీవుల్లా బక్తియార్, రాష్ట్ర కోఆర్డినేటర్ ముహమ్మద్ అయ్యూబ్ వినతిపత్రం సమర్పించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి నగరానికి విచ్చేసిన విసిని రూట ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసీవుల్లా బక్తియార్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలలో ఉన్నత విద్యాభివృద్ధికి ఎంతో మహోన్నతమైన ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అబ్దుల్ హఖ్ ఉర్దూ విశ్వవిద్యాలయం స్థాపించారని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలలో ఆ దిశగా అభివృద్ధి చెందలేకపోయిందని, ఇప్పటికైనా ప్రణాళిక రూపొందించి ఉర్దూ తో పాటు శాస్త్ర సాంకేతిక, వృత్తి విద్య, ప్రొఫెషనల్, డిప్లమా, స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు స్థాపించాలని విశ్వవిద్యాలయానికి దేశంలో తగిన గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్ ఫైజి, సయ్యద్ హిదాయతుల్లా ఈనెల 9,10 తేదీలలో కడప లో జరగనున్న జాతీయ ఉర్దూ సెమినార్ కు ఆహ్వానించారు.

వినతి పత్రం అందజేస్తున్న రూట నాయకులు

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 నుంచి 16 వరకు నిర్వహించే అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. ర్యాలీ కోసం ఇంజినీరింగ్ విభాగం వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేసి, రన్నింగ్ ట్రాక్ పై ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ర్యాలీ ప్రాంతంలో మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచేలా చూడాలని, తాగునీటి సరఫరా సవ్యంగా ఉండేలా చూడాలని కూడా సూచించారు. ఇండోర్ స్టేడియంలో సిబ్బందితో సహకరించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి అందిన వివిధ అర్జీలను స్వీకరించి, ప్రతి అర్జీపై సంబంధిత శాఖాధిపతులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, డిప్యూటీ కమిషనర్ రాంబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, రెవెన్యూ ఆఫీసర్ కన్నయ్య, విజయ భాస్కర్ గౌడ్, ఇతర నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

బిఇడి సెమిస్టర్ల పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వ విద్యాలయ పరిధిలోని బిఇడి కళాశాలల 2,4 సెమి స్టర్ల పరీక్షలు సోమవారం జిల్లాలోని 16 కేంద్రాలలో ప్రారం భమయ్యాయి. వైవీ యూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, పరీక్షల నియం త్రణ అధికారి ఆచార్య కృష్ణారావు కడపలోని ఎస్‌వి బిఇడి కళాశాల, శ్రీహరి బిఇడి కళాశాల్లో నిర్వహిస్తున్న పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిం చారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతా వరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. . హై పవర్ కమిటీ సభ్యులు ఆచార్య సునీత, డాక్టర్ రియాజున్నిసా కడపలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్షలను తనిఖీ చేస్తున్న విసి

రేపు చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 6న నిర్వహించబోయే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దుల రాహుల్, వీరబాబు రవి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన నిధులు రూ.3,480 కోట్లు విద్యార్థులకు ఇవ్వకుండా విద్యకు దూరం చేసిందని విమర్శించారు. ఏ ప్రభుత్వమైన బకాయిలు ఉంచితే నూతన ప్రభుత్వం వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 77ను రద్దుచేసి ప్రయివేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలో పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిగ్రీ హానర్స్ విధానాన్ని రద్దు చేయాలని, విద్యార్థులకు కోర్స్ ఎంపిక చేసే హక్కును కాల రాస్తుందని,పరీక్ష విధానం అంతా గందరగోళం ఏర్పడుతుందని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని తెలిపారు. కళాశాలలో హాజరుతో పాటు సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా హాస్టల్ పరిస్థితి రోజురోజుకి దిగజారుతోందని వాపోయారు. వెంటనే సొంత భవనాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. యూనివర్సిటీలలో 3220 పోస్టులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బాల్య వివాహాలతో నష్టం : సిడిపిఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : బాల్య వివాహాల వల్ల అనేక నష్టాలు వాటిల్లుతాయని సిడిపిఒ శోభారాణి అన్నారు. సోమవారం మోచంపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో కిషోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైన్ పిల్లల రక్షణ కోసం1098 నంబర్‌ను డయల్ చేయాలన్నారు. పిల్లల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె. దీప, డిసిపియు సిబ్బంది లక్ష్మీ ప్రసన్న, అంగన్వాడీ కార్యకర్త డి.పద్మావతి, షర్మిల, హెచ్‌ఎం గాయత్రి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో కోత : వైసిపి

ప్రజాశక్తి - కడప : ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తున్నారని, వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు అందేవని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథరెడ్డి, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో దౌర్భాగ్య రాజకీయాలు, చేతకాని రాజకీయాలు నడుస్తున్నాయని విమర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో అమలవుతుందన్నారు. సోమవారం కడప జిల్లా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ అభివృద్ధిని కాంక్షిస్తూ కార్యకర్తలకు అండగా ఉండేలా జిల్లా నాయకులతో చర్చించినట్లు తెలిపారు. చంద్ర బాబు నాయుడు అమలుకు ఆవకాశం లేని హామీలు ఇచ్చారన్నారు.అన్నారు. జగన్ అమ లు చేస్తున్న పథకాలు కాపీ కొట్టి ప్రజలను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు.

ముగిసిన గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో కామర్స్, కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలో వైవీయూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఆచార్య ఎ. జి. దాము, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం ఆచార్యులు విశ్వనాథరెడ్డి, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం. శ్రీదేవి, ఆచార్య జి. విజయభారతి, డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్ ఎస్ పి వి రమణ, డాక్టర్ సుబోస్ చంద్ర, డాక్టర్ శ్రీనివాసరావు ఇంటర్వ్యూల నిర్వహణలో పాల్గొన్నారు.

నిర్వాసితుల భూములను కాపాడాలి : వ్య.కా.స

ప్రజాశక్తి - ముద్దనూరు

అన్యాక్రాంతమైన గండికోట నిర్వాసితుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, నిర్వాసితులకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, డివైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వాసి తులతో కలిసివారు తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ గండికోట నిర్వాసిత ప్రజలకు ప్రభుత్వం ముద్దనూరులోని చౌటిపల్లె గ్రామంలో కేటాయించిన భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. నిర్వాసితులకు ముద్దనూరులోని మంగపట్నం రెవెన్యూ పొలంలో కేటాయించిన భూములకు జిల్లా అధికారులు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో ఆ భూములు స్థానికులు, కొందరు అక్రమార్కులు, రాజకీయ నాయకులు వందలు ఎకరాలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. చౌటిపల్లి గ్రామం నిర్వాసితులకు కోసం అప్పటి ప్రభుత్వం 2010లో 869 ఎకరాల భూమి కేటాయించి, కంప చెట్లు, పొదలు తొలగించేందుకు రూ. 31,29,696 ఖర్చు చేసిందన్నారు. ఇప్పటికే అసైన్ మెంట్ ఆమోదం పొందిన భూములకు పట్టాలు మంజూరు చేయాల్సింది ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వాసితుల భూములకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. అన్యక్రాంతమైన భూములను కూటమి ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని నిర్వాసితులందరికీ, ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేసి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ. 3.5 లక్షలు ఇవ్వలేదన్నారు. నిర్వాసితులు అధికారులను అడిగితే బడ్జెట్ లేదని దాటేస్తు న్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 12 లక్షల అమలు చేస్తామని వాగ్దానం చేశారన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని డిమా ండ్ చేశారు లేకపోతే నిర్వాసితులను కలుపుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చౌటపల్లి నిర్వాసితులు రామలింగారెడ్డి యోహాన్, మాజీ ఎంపిటిసి సభ్యులు గురునాథ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రైతుల సంక్షేమమే ధ్యేయం : పుత్తా

ప్రజాశక్తి- కమలాపురం టౌన్

రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చదిపిరాళ్ల చెరువు నుంచి దిగువ కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి కరువు జాబితాలో చేర్చాలని, ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపుతామన్నారు. 2025 ఆగస్టులోపు సర్వరాయ సాగర్ పనులు కాంట్రాక్టర్లతో పూర్తి చేయించాలని అధికారులను ఆయన కోరారు. కార్య క్రమంలో నీటి శాఖ అధికారులతో పాటు తహశీల్దార్ శివరామిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు రాఘవరెడ్డి, లోమడ వాసుదేవ రెడ్డి, నాగిరెడ్డి దివాకర్ రెడ్డి, గంగవరం ప్రసాద్ రెడ్డి, పాలగిరి సుబ్బారెడ్డి ఖాదర్ బాషా జంపాల నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఓబుల్ రెడ్డి, రఘురాంరెడ్డి, పరంధామరెడ్డి, శంకర్ యాదవ్, ఎర్రబెల్లి సుబ్బారెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, శీలం మల్లేశ్వరుడు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుత్తానరసింహారెడ్డి

సమస్యలను తెలియజేయాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప :

ప్రజలకు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థకు ఫిర్యాదు చేయొచ్చని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం కడప నగరంలోని రైతు బజార్‌లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ విధివిధానాలను, పారా లీగల్ వాలంటరీ విధివిధానాలను తెలియజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి వివరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటరీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ సమావేశం

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 6న ఆధునిక జీవశాస్త్రంలో జరిగే పరిశోధనలు గురించి అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారని తెలిపారు. దాదాపు 135 పైగా పరిశోధిక వ్యాసాలు పరిశోధకులు వారి పరిశోధక వ్యాసాలు సమర్పించాలని కన్వీనర్ జంతుశాధ్యాపకుడు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఇటువంటి సమావేశాలకు విద్యార్థులు హాజరవడం వల్ల పరిశోధక రంగంపై ఆసక్తి, ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కలుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జమ్మల మడుగు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన (2024) అభ్యర్థి పాముల బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో పెద్దముడియం గ్రామానికి చెందిన ఎస్ అబ్దుల్ రషీద్, చౌటపల్లి గ్రామం, కొండాపురం మండలానికి సంబంధించి కేశవరెడ్డి, ఎర్రగుంట్ల మండలం నుండి జానకి దేవి, ఉదయభాస్కర్ తన అనుచరులతో డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయజ్యోతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, జాతీయత, సామాజిక న్యాయం, సమానత్వం కలిగిన అభివృద్ధి కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని చెప్పారు. 2029 ఎన్నికల్లో వైఎస్ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో రాజేష్, మహేష్ నాయుడు, వెంకటస్వామి, శివకుమార్ రెడ్డి, సురేష్, ఓబయ్య పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయజ్యోతి

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప : ఎసిఎ అండర్ -14 గ్రూప్ -బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కెఎస్ఆర్ఎమ్ క్రికెట్ మైదానంలో గుంటూరు, విజయనగరం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 313 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కౌశిక్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 151 పరుగులు (సెంచరీ) చేశాడు. విజయనగరం జట్టులోని సాయి ప్రణీత్ మూడు వికెట్లు తీసుకున్నాడు. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నెల్లూరు కృష్ణ, జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 90.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. ఆ జట్టులోని సుశాంత్ 67, సాయి యశ్వంత్ 51 పరుగులు చేశారు. కృష్ణ జట్టులోని రిత్విక్ రెండు వికెట్లు తీసుకున్నాడు. కెఆర్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం, శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 45.1 ఓవర్లలో 130 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని హేమ చంద్ర నాయక్ 29 పరుగులు చేశాడు. శ్రీకాకుళం జట్టులోని సాత్విక్ ఐదు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 44.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. ఆ జట్టులోని నేత్ర కిరణ్ 77, వివేకానంద 62 పరుగులు చేశారు.

151 పరుగులు చేసిన కౌశిక్

చిరస్మరణీయుడు కందుల శివానందరెడ్డి

కళాశాల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కీ.శే.కందుల శివానందరెడ్డి అందరి హృదయాల్లో చిరస్మరణీయుడని కెఎస్ఆర్ఎమ్ కళాశాల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో 4వ వర్ధంతి ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞత, విలువలు, ప్రజా సేవే ఆయన ఆస్తి అన్నారు. వారి దృఢమైన న్యాయ కత్వం, మిగతావారికి దిక్సూచిగా అనుసరించడానికి ఉపయోగమని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి మాట్లాడుతూ కందుల శివానందరెడ్డి మానవాళికి అందించిన సేవలను, ప్రత్యేకించి కడప నగరానికి ఉచిత నీటి సరఫరా, ఉచిత భోజనం, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి కార్యక్రమాలను గుర్తుచేశారు. చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్ఫూర్తి ప్రదాత, వ్యూహాత్మక దృష్టి కలిగిన నాయకుడు, కష్టం, నష్టం సమానంగా చూసే వారని అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని తొలుత ప్రారంభించారు. మొత్తం గా 250 మంది రిమ్స్, భోగ పార్వతమ్మ వారికి రక్త దానం చేసి అందించారు. ఇఎ పిసిఇటి 2024 ద్వారా చేరిన మెరిట్ టోరియస్ విద్యార్థులకు, కళాశాల నిర్వహిస్తున్న కేజీ సెట్ 2023 మెరిట్ స్కాలర్షిప్ పొందిన విద్యార్థులకు ప్రత్యేకంగా స్కాలర్షిప్ పంపిణీ చేశారు. రిమ్స్ లో 'కందుల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంగళ, శుక్రవారాల్లో 350 మందికి తగ్గకుండా అన్నదానం, స్వచ్ఛమైన మంచినీరు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ, ఛైర్మన్ కందుల రాజమోహన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్, కెఎల్ఎం ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమ్మ, కె ఎస్ ఆర్ ఎం మేనేజ్మెంట్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగమణి, వివిధ విభాగది పతులు, డీన్‌లు, టీచింగ్ అండ్ నాంటీచింగ్, కల్చరల్ కో-ఆర్డినేటర్‌డాక్టర్ వీర శంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సురేష్ బాబు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుల శివానందరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నాం : ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టబోతున్నామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధి ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కడుపు నింపేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్‌లను ప్రారంభిస్తున్నారన్నారు. అందులో భాగంగా మైదుకూరులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అన్న క్యాంటీన్‌లో ఉదయం 350 మందికి, మధ్యాహ్నం 500 మందికి, సాయంత్రం 200 మందికి ఆహారం అందించనున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాన్ని బట్టి మరింత పెంచేందుకు ఫౌండేషన్ వారు అంగీకరించారన్నారు. క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా అల్పాహారాన్ని ఆయన వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ నాగేశ్వరి, టిడిపి నాయకులు బిఎన్ శ్రీనివాసులు, ధనపాల జగన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, కౌన్సిలర్ కుర్రా రాధాకృష్ణ, చిన్నా, మున్సిపల్ సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

సిమెంట్ రోడ్డుకు భూమిపూజ

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు గ్రామపంచాయతీ పరిధిలోని మాలవాడలో సోమవారం సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు రూ.11లక్షలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి పాపినేని రాంబాబు, మండల ఇంజనీరింగ్ అధికారి సుబ్రహ్మణ్యం. ఇంజనీర్ అసిస్టెంట్ రమాదేవి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్దయ్య తెలిపారు. నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో సోమవారం నీరు నిలిచిన ప్రదేశంలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగునీటి కుంటల్లో, వర్షపు నీరు చేరే ప్రదేశాల్లో వైద్య సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయించినట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలనుశుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం మురికి కాల్వలో ఎక్కడపడితే అక్కడ వేయకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ప్రశాంతి, ఆశా కార్యకర్త సురేఖ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పాపాగ్ని నది నుండి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రైతులు, నాయకులు డిమాండ్ చేశారు. పాపాగ్ని నదిలోని మూలవంక సమీపంలో చేస్తున్న అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలని రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వీరికి బిజెపి, సిపిఐ నేతలు సంఘీభావం తెలిపారు. నదిలోకి ఇసుక ట్రాక్టర్లను వెళ్లనీయమంటూ రైతుల ఆందోళన చేపట్టారు. ఉచిత ఇసుకను కొందరు ఇసుకాసురులు పక్కదారి పట్టిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో నుంచి వేంపల్లెకు వచ్చి పాపాగ్ని నది ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకొంటున్నారని రైతులు విమర్శించారు. ఇసుకను తీసుకొని అధిక స్పీడ్‌తో వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని భయాందోళన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన తహశీల్దారు హరినాథ్‌రెడ్డి, ఎస్ఐ రంగారావు నిరసన చేస్తున్న ప్రాంతానికి చేరుకుని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

గ్రంథాలయం కొత్త బైపాస్ వద్దకు మార్పు

ప్రజాశక్తి - కొండాపురం

గ్రంథాలయ ప్రారంభోత్సవంలో విష్ణువర్ధన్‌రెడ్డి

కొండాపురం పాత ఊర్లోని గ్రంథాలయాన్ని కొత్త బైపాస్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి తరలించినట్లు గ్రంథాలయాధికారి వరలక్ష్మి తెలి పారు. గ్రంథాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎన్‌డిఎ కూటమి నాయకుడు చామల విష్ణువర్ధన్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాల యాన్ని విద్యార్థులు, నిరుద్యోగ యువత, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ప్రెసిడెంట్ విశ్వనాథరెడ్డి, శ్రీరామిరెడ్డి (బాబు), శ్రీనివాసరెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

40 మద్యం బాటిళ్లు స్వాధీనం : నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం సిఐ దస్తగిరి తెలిపారు. నల్లబల్లె, మంగపట్నం గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. నల్లబల్లెలో ఒక వ్యక్తి వద్ద 10 బాటిళ్లు, మంగపట్నంలో మరొకరి వద్ద 10 బాటిళ్లు, ముద్దనూరు, సోంపల్లెల్లో మరో 20బాటిళ్లను స్వాధీనం చేసుకుని మొత్తం నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. మద్యం అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

వేంపల్లెలో మరో తొమ్మిది..

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆదేశాల మేరకు సిఐ సురేష్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ తనిఖీలు చేపట్టారు. పరిడి పల్లిబాబా అనే వ్యక్తి తన చికెన్ షాపు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విషయం బయటపడింది. మద్యం బాటిళ్లు, పరిడి పల్లి బాబాను అదుపులోకి తీసుకున్నామన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

మాట్లాడుతున్న ఎంపిడిఒ బి.రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించడమే ప్రభుత్వం చేపట్టిన నైపుణ్య గణన ముఖ్యఉద్దేశ్యమని ఎంపిడిఒ బి.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల కో-ఆర్డినేటర్ టి.సతీష్ శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చదువుకొని ఖాళీగా ఉన్న వారిని గుర్తించి ఉద్యోగం కల్పించడం, చదువుకోని వారికి కూడా ఏ రంగంలో పని చేయగలుగుతారో వారికి శిక్షణనిస్తారన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నిరుద్యోగ సమస్య తీర్చడానికి కృషి చేయాలన్నారు.

సింహాద్రిపురం : నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ సభా భవనంలో సచివాలయ సిబ్బందికి స్కిల్ డెవలప్మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలో డిగ్రీ, ఇంటర్, ఐటిఐ, ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసి ఖాళీగా ఉన్న వారిని గుర్తించాలన్నారు. వారిని స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో శిక్షణ తరగతులకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మనాభ రెడ్డి, ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చంద్రమోహన్, ట్రైనర్స్ అశోక్, కల్యాణ్ పాల్గొన్నారు.

ముద్దనూరు : స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా నైపుణ్య గణన-యువత భవితకు భరోసా కార్యక్రమాన్ని ఎంపిడిఒ ముకుందారెడ్డి ప్రారంభించారు. మండలంలోని 12 సచివాలయాల్లోని 118 మంది ఉద్యోగులు శిక్షణలో పాల్గొన్నారు. సర్వే చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డీ వీరభద్రుడు, పరిపాలన అధికారి పరిపూర్ణ అరుంధతి పాల్గొన్నారు.

పెద్దముడియం : ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బందికి స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణనిచ్చారు.ఎంపిడిఒ ఎస్.శంషాద్ భాను అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే ఏవిధంగా చేయాలి, ప్రజా సమస్యల పట్ల ఎలా స్పందించాలి, ఎలాంటి సేవలు అందించాలి అనే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : సర్వే ఆధారంగా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తుందని ఎంపిడిఒ వీరకిషోర్ తెలిపారు. స్థానిక మండల సభా భవనంలో సోమవారం నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతు నైపుణ్య గణనలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి 15-59 ఏళ్ల వయసున్న నిరుద్యోగులను, వారిలోని నైపుణ్యాన్ని గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే అన్నారు. వారికి ఇష్టమైన రంగంలో నైపుణ్యాలను మెరుగుపరచి స్వయం ఉపాధి కల్పించనున్నట్లు ఎంపిడిఒ వివరించారు. ప్రతినెల మండల స్థాయిలో జాబ్‌మేళ నిర్వహిస్తారన్నారు. ప్రతి నియోజక వర్గానికి ఒక స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఉచిత శిక్షణనిచ్చి ఉపాధి కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్లు చంద్ర యాదవ్, విజయ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వీరకిషోర్

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి

గెలుపొందిన జట్టుకు కప్పును అందజేస్తున్న ఎమ్మెల్సీరాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడవ తేదీ నుంచి బాలికల సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలు, ఎంపికలను ఘనంగా కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన వారికి సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు ప్రతి మనిషి జీవితంలో అంతర్భాగమన్నారు. మనిషి పుట్టుకతోనే క్రీడలు ప్రారంభిస్తాడని, ప్రతి ఒక్కరికి క్రీడలు అవసరమని పేర్కొన్నారు. క్రీడలు ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెడతాయన్నారు. పాఠశాలకు ఎంతో పేరు, కీర్తిని ఇస్తాయన్నారు. తమ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఏడాది నుంచి క్రీడాకారులకు క్రీడా దుస్తులు, ఛార్జీలు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. తమ ప్రాంతంలో సాఫ్ట్ టెన్నిస్ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గెలుపొందిన జట్లకు ఎమ్మెల్సీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ దివి కొండారెడ్డి, విద్యాధరి పాఠశాల సిఇఒ భాను ప్రకాష్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అమ్రుణకుమారి, జిల్లా సాఫ్ట్ టెన్నిస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రవీణ్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ పి.గణేష్ బాబు, సాజిద్ పాల్గొన్నారు.

గండికోటలో టోల్ ఛార్జీ వసూలు ఆపాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో కొద్ది రోజులుగా టోల్‌గేటు చార్జీలు వసూలు చేస్తున్నారని, దాన్ని వెంటనే ఆపాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ నలుమూలలు, సుదూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి గండికోట అందాలను చూడాలని పర్యాటకులు వస్తున్నారన్నారు. వారి ఆనందం గండికోట గ్రామం ప్రవేశంలోనే టోల్ ఛార్జీ పేరుతో ఆవిరి అయిపోతోందన్నారు. వివిధ రకాల ధరల పేరుతో వారాంతపు రోజులలో ఒక ధర, మామూలు రోజులలో ఒక ధర నిర్వహిస్తున్నారన్నారు. మరికొన్ని సార్లు రూ.10 టికెట్ ధరను

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

మార్కర్ పెన్నుతో రూ.30 దిద్ది టికెట్లు విక్రయిస్తున్నారన్నారు. ఈ కారణంగా పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. కోట లోపల మరుగుదొడ్లు, తాగునీరు, విశ్రాంతి గదులు వంటి సౌకర్యాలు ఎక్కడా కనపడవని పర్యాటకులు పలు సందర్భాలలో వాపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పత్రికలు కూడా ప్రచురించాయన్నారు. కేంద్ర పురావస్తు శాఖకు సంబంధించిన వాటిలో రాష్ట్ర పర్యాటక శాఖ వారు ఇలా ఛార్జీల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారని అక్కడి ప్రజలు బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. ఇది అధికారికంగానా, అనధికారికంగా జరుగుతుందా అనేది ప్రశ్నలా మిగిలిపోయిందన్నారు. అధికారులు చెబితే తప్ప ప్రజలకు, పర్యాటకులకు అర్థం కాదన్నారు. అధకారులు ఈ టోల్ ఛార్జీలు, ఇతరత్రా రూపంలో వసూళ్లపై దృష్టి సారించాలని కోరుతున్నామని శివకుమార్ పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ, అధికారులు

ఇద్దరు విద్యార్థులను కాటేసిన పాము

- పరామర్శించిన ఆర్‌డిఒ సాయిశ్రీ, అధికారులు

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం ఎపిఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్ గురుకుల పాఠశాలలో ఆదివారం రాత్రి మూడు గంటల ప్రాంతంలో ఇద్దరు విద్యార్థులను పాము కాటేసింది. ఎనిమిదవ తరగతి చదువుతున్న పల్లవి, వర్షిణిని పాము కాటు వేసింది. ఆ సమయంలో తమను పాము కాటు వేసిందని విద్యార్థులు గుర్తించలేకపోయారు. నైట్ డ్యూటీ నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ కోటమ్మ వెంటనే హెల్త్ సూపర్వైజర్‌కు సమాచారమిచ్చి ప్రథమ చికిత్స చేయించారు. సోమవారం ఉదయం డార్మెటరీలో పరిశీలించగా పాము కనబడడంతో చంపేశారు. వర్షిణిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి, పల్లవిని కడప రిమ్స్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జ్యోతి తెలిపారు. విద్యార్థులను జమ్మలమడుగు ఆర్‌డిఒ ఆదిమూలపు సాయిశ్రీ, తహశీల్దార్ గుర్రప్ప, ఎంపిడిఒ నాగ ప్రసాద్, ఎంఇఒ ఓబులేసు పరామర్శించారు. అనంతరం గురుకులంలో ఎలాంటి పిచ్చి మొక్కలు, చెత్త చెదారం లేకుండా జాగ్రత్త వహించాలని ఆర్‌డిఒ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జ్యోతికి సూచించారు.

విద్యుత్ ఛార్జీలపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వినతిపత్రం సమర్పిస్తున్న చేనేత నాయకులు

చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని ప్రభుత్వం గత ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచిపోతున్నప్పటికీ ఇంత వరకు ఆ ఊసే ఎత్తడంలేదని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి నరసింహులు కోరారు. ఆ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన వినతిపత్రం సమర్పించారు. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లాలో ఈ పథకం 100 యూనిట్ల వరకు అమలు అవుతోందన్నారు. కడప జిల్లాలో మాత్రం అమలుకు నోచుకోలేదన్నారు. తాము చేనేత రంగపైననే ఆధారపడి జీవిస్తు న్నామన్నారు. అధికారులు వెంటనే స్పందించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ ధరణి తిమ్మాయపల్లి గ్రామం పూసయ్యగారి ఆశ్రమంలో దిగంబర అవధూత కొండయ్య స్వామి 43వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈనెల 5న మంగళవారం రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారీ కేక్ కట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. 6న జాక్‌పాట్ విభాగం పోటీలు ఉంటాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.3 లక్షలు, రెండవ బహుమతి రూ.2 లక్షలు అందిస్తారని తెలిపారు. 7న గురువారం సీనియర్స్ విభాగంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెదటి బహుమతి రూ.1,58,118, రెండవ బహుమతి రూ.1,08,118, మూడవం బహుమతి రూ.75,118, నాల్గవ బహుమతి రూ.50,118, 5వ బహుమతి రూ.25,118 అందిస్తామని తెలిపారు. 8న శుక్రవారం ఓల్డ్ కేటగిరి విభాగం, 9న శని వారం ఆరు ఆరు పళ్ల విభాగంలో పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

6న సిపిఎం పట్టణ మహాసభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సిపిఎం మూడవ మహాసభలు ప్రొద్దుటూరులో ఈనెల 6న ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు పార్టీ సభ్యులందరూ హాజరుకావాలన్నారు. గడచిన మూడేళ్ల కాలంలో పార్టీ కార్మికులకు, ప్రజలకు, సమాజానికి ఉపయోగపడిన పనులను సమీక్షించి, రాబోయే మూడేళ్లలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలపై చేపట్టవలసిన కార్యక్రమాలపై ప్రణాళిక తయారు చేస్తామన్నారు. మహాసభకు సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు రాజా హాజరవుతారన్నారు. సమావేశంలో సిపిఎం సుందరయ్య నగర్ ఏరియా కార్యదర్శి శేఖర్, అమృత్‌నగర్ ఏరియా పార్టీ సభ్యుడు చెన్నారెడ్డి, ఆటోశాఖ కార్యదర్శి శీను చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలని నిరసన

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయిపేట మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని బిజెపి నేషనల్ కౌన్సిల్ సభ్యులు కె.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేటి వాగు ప్రాజెక్ట్ అసంపూర్తి పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. రాయచోటి-వేంపల్లి ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు పూర్తిచేసి అదనపు సర్వీసు బస్సులను పెంచాలన్నారు. రైతులు, రైతు కూలీలకు కరువు పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు రామచంద్రారెడ్డి తహశీల్దార్ విజయ కుమారికి వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్‌కు కూడా వినతిపత్రమిస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని రైతులు పాల్గొన్నారు.

పశుగణనను పరిశీలిస్తున్న వాసా శ్రీనివాస

ప్రతి ఇంటికెళ్లి పశుగణన

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఇంటికెళ్లి పశుగణన పక్కాగా చేయాలని ముద్దనూరు ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వాసా శ్రీనివాస సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన జాతీయ పశుగణన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ పశుగణన పారదర్శకంగా చేయాలని సూచించారు.

రోడ్ల గుంతలు పూడ్చడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్ల మీద గుంతలు పూడ్చే కార్యక్రమం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు ప్రగతికి, నాగరికతకు ప్రతిబింబాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్లు భిక్షాటన చేశారని తెలిపారు. వైసిపి ప్రభుత్వ పాలనలో కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనాలంటే భయపడేవారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయని తెలిపారు. వాహనాలు దెబ్బతినడమే కాకుండా ప్రయాణ సమయం రెట్టింపు అయ్యేదని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో వైసిపి ఓటమికి రోడ్ల దుస్థితి కూడా ఓ ప్రధాన కారణమన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రస్తుత ప్రభుత్వం రోడ్ల మీద గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. ఇది ఒక నిరంతర ప్రక్రియ కావాలని, టిడిపి కార్యకర్తలకు ఉపాధి కార్యక్రమం కాకూడదని సూచించారు.

అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఇఒ, నాయకులు

అల్లాడుపల్లెలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

కార్తీక మాస మెదటి సోమవారం సందర్భంగా అల్లాడుపల్లె దేవాలయ ఆవరణలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు. వీరభద్ర స్వామి దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు నరేంద్ర, అర్చకులు భరత్‌శర్మ, గోవిందు స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు దేవస్థాన నిత్య అన్నదాన, సర్వజన అన్నదాన సత్రంలో, ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో కేతవరం గ్రామానికి చెందిన గంజికుంట వీర ప్రతాప్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెరుగు వీర నారాయణ యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, వీరారెడ్డి, మాజీ ఎంపిపి గురివిరెడ్డి, బద్రిపల్లె సర్పంచ్ గుత్తి మల్లీశ్వరి, నారాయణ యాదవ్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ముద్దనూరు, బొందకుంట శివాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొందలకుంట గ్రామంలో 800 ఏళ్ల చరిత్ర కలిగిన అతి పురాతన బసవేశ్వర ఆలయాన్ని ఎంపిడిఒ అలవలపాటి ముకుందరెడ్డి దంపతులు దర్శించుకుని స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు అనిల్ స్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కందుల శివానందరెడ్డి చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - వేంపల్లె

శివానందరెడ్డి చిత్రపటానికి నివాళు లర్పిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

విద్యాదాతకు మారు పేరుగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి చిరస్మర ణీయుడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపా ధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి కొని యాడారు. మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి ఐటిఐలో ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఆయన స్మారక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల శివానందరెడ్డి చిత్ర పటానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తులసిరెడ్డి, పేర్ల పార్థసారధిరెడ్డి, టిడిపి నేత డివి సుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, గొటూరు నాగభూషణం పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పిం చారు. విద్యార్థులు శివా నందరెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించి, మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఐటిఐ సిబ్బంది అమర్నాథరెడ్డి, ప్రభాకర్ నాయుడు, ఉత్తమారెడ్డి, వెంకటరెడ్డి, విజయ భాస్కర్, నరసింహారెడ్డి, మార్కయ్య, నాగరాజు, ఆశ్రయ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

కడప జిల్లా, చెన్నూరు మండలం, చెన్నూరు గ్రామ పంచాయతి డోర్‌నెం.6/50, గోదినవీధిలో ఉండే రెడ్డి సిద్ధీశ్వరయ్య కుమారుడు రెడ్డి ఓంప్రకాష్ కి చెందిన పాస్‌పోర్ట్ 18.09.2024 తేదీన బైక్ లో కడపకు వెళ్తుంటే మార్గమధ్యలో ఎక్కడో పోయినది. ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **N8124775** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గానీ **7989261597** మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.

శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానము
(శివాలయము)
ప్రొద్దుటూరు టౌన్ (మం), కడప జిల్లా

ప్రకటన

దేవదాయశాఖ. శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము, ప్రొద్దుటూరు నందు కార్తీక మాస ఉత్సవములలో 4 సోమ వారములకు, పౌర్ణమికి జరుపునపుడు, లైటింగ్ డెక్టరేషన్ 400 సీరియల్ లైట్స, 20 day లైట్స, 20 ఫోకస్ లైట్స 20 లైటింగ్ బోర్డ్స్, క్యూలైన్ కొరకు ఐరన్ బ్యారీ గేట్స్ 30, ఏర్పాటు చేయుటకు వాటికి ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు 11.11.2024 వ తేది సాయంత్రం 5-00 గం,,లలోపు కార్యనిర్వహణాధికారి శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము కార్యాలయము నందు అందజేయవలసినదిగా కోరడమైనది.

కె.రామచంద్రాచార్యులు, M.A., B.Ed.,
కార్యనిర్వహణాధికారి
శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానము
దేవదాయశాఖ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.